# రాష్ట్రపతి ఎన్నిక ఆదివాసులకు సామాజిక న్యాయం, సాధికారత ఎండమావే

**మనదేశ** రాష్ట్రపతి ఎన్నిక జూలై 18వ తేదీన జరుగనుంది. ప్రజలు తమ ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్రపతిని ఎన్నుకునే విధంగా ఈ ఎన్నికలలో వారి భాగస్వామ్యమేమీ లేకున్నప్పటికీ, పాలక రాజకీయ పార్టీలన్నీ ఈ ఎన్నికలకు ప్రాధాన్యత నిస్తున్నాయి. రాష్ట్రపతి ఎన్నిక తర్వాత 2024లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ ఎన్నికలను అవి కీలకమైనవిగా భావిస్తున్నాయి. పాలక రాజకీయ పార్టీలు రాష్ట్రపతి ఎన్నికలలో తమ అభ్యర్థిని ఎంపిక చేసుకోవటం ద్వారా రానున్న లోక్‌సభ ఎన్నికలలో ప్రజలను తమకనుకూలంగా ప్రభావితం చేయటానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఎన్నికల్లో ప్రయోజనం పొందాలని భావిస్తున్నాయి.

చాలాకాలంపాటు ఈ ఎన్నికలపై, అభ్యర్థి ఎంపికపై రభస తర్వాత, రాష్ట్రపతి ఎన్నికలలో ఉమ్మడి అభ్యర్థిని నిలపటంలో మూడు పర్యాయాలు విఫలమైన తర్వాత వివిధ దృక్పథాలు, ప్రయోజనాలున్న వివిధ ప్రతిపక్ష పార్టీలు – చివరికి బిజెపి మాజీ నాయకుడు, ప్రస్తుత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయిన యశ్వంత్ సిన్హాను వారి ఉమ్మడి రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేయగలిగారు. ప్రస్తుతం కేంద్రంలో పాలన సాగిస్తున్న విద్వేష, హిందూమతతత్వ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఈ ఎన్నికలలో తాము సిద్ధాంతం కొరకు, రాజ్యాంగ పరిరక్షణ కొరకు పోరాడుతున్నామని వారు ప్రకటించారు. ప్రజల నడుమ ఈ నినాదాన్ని ప్రచారం చేయటం ద్వారా, ఎన్నికల ప్రయోజనం పొందాలనేది వారి ఉద్దేశ్యం.

మరోవైపున రాజకీయ అధికార క్రీడలను, మోసకారీ తనాలను మరింత నైపుణ్యంగా ప్రదర్శించగలిగిన; కేంద్రంలో, మరికొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాధికారంలో వున్న బిజెపి – సంతాల్ ఆదివాసీ సమూహానికి చెందిన ద్రౌపది ముర్మును తమ రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించి, ప్రతిపక్ష పార్టీలను తేల్చివేసి, ఎన్‌డిఏ కూటమి అభ్యర్థి విజయానికి మార్గాన్ని సుగమం చేసింది. ఆదివాసీ అభ్యర్థి, ప్రత్యేకించి మహిళా అభ్యర్థిని ఎంపిక చేయటంతో తమ అభ్యర్థిని ప్రదర్శించి ఓటర్లను ప్రభావితం చేసి ఏదోవిధంగా ఎన్నికల ప్రయోజనం పొందాలన్న ప్రతిపక్ష పార్టీల ఆశలు దీనితో అడుగంటాయి.

యశ్వంత్‌సిన్హా సోషలిస్టులలో చంద్రశేఖర్ సమూహానికి చెందినవాడిగా వుండటంతోపాటు బీహార్‌లో రణవీర్‌సేనకు మార్గదర్శకునిగా, నాయకునిగా వున్నాడనే అంశాన్ని కూడా ఖచ్చితంగా పేర్కొనాలి. హిందూమతతత్వ జాతీయవాద శక్తుల దాడి నుండి రాజ్యాంగాన్ని రక్షించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రతిపక్షాల ఉమ్మడి రాష్ట్రపతి అభ్యర్థిగా ఆయనను నిలబెడుతున్నప్పటికీ, రణవీర్ సేన నాయకునిగా, దీర్ఘకాలం పాటు బిజెపి నాయకునిగా, బిజెపి ప్రభుత్వంలో మంత్రిగా ఆయన చరిత్రను పరిశీలిస్తే, అతని ఎంపిక సరైంది కాదని తెలుపుతోంది. ఈ నాటకమంతా 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం భారత ప్రజల ముందు సిద్ధం చేస్తున్న భూమిక అనేది స్పష్టం. దీని ద్వారా ప్రతిపక్షాల సమైక్య ముఖాన్ని ప్రదర్శించదలుచుకున్నారు. అయితే, నిత్యావసర వస్తువుల ధరలన్నీ చుక్కలనంటుతుంటే దీనికి వ్యతిరేకంగా వారి ఐక్యత ఏమైంది? నూతన కార్మిక కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కులన్నింటినీ కాలరాచి వేస్తున్నపుడు సమైక్య ప్రతిపక్ష వైఖరి ఎక్కడుంది? ప్రజల జీవితాలకు, జీవనాధారాలకు సంబంధించిన ఈ అంశాలపై పార్లమెంట్ లోపలా, బయటా కూడా వీరి విలువైన చర్యలేమీ లేవు. అయినప్పటికీ ప్రజలకు పాత్రేమీలేని ఈ రాష్ట్రపతి ఎన్నికలలో ప్రజలను అభ్యర్థిస్తూ వీరు సాగుతున్నారు.

ద్రౌపది ముర్మును తమ రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించే బిజెపి యొక్క యుక్తి, ఆధునికానంతరవాదం వైపు మొగ్గి వున్న, విద్యావంతులైన మధ్యతరగతికి చెందిన ప్రగతిశీల మేధావులుగా చెప్పబడేవారిని సైతం గందరగోళానికి గురిచేసింది. "భారత స్వతంత్ర 75వ సం॥లో దళితుడైన రాష్ట్రపతి తదనంతరం దేశ సర్వోన్నతమైన ఆ స్థానాన్ని ఒక దళిత మహిళ అధిరోహించడమనేది, భారత ప్రజాస్వామ్యం లోతుగా పాతుకుంటున్నందుకు పేర్కొనదగిన నిదర్శన"మని, "భారత రాష్ట్రపతిగా ఒక మహిళ అందులోనూ ఆదివాసీ మహిళ భారత రాష్ట్రపతి కానుండటాన్ని, ప్రగతిశీల స్వభావం కలిగిన ఈలాంటి పరివర్తనను సమర్థించకపోవటం ఎంత వెర్రిబాగుల తనమౌతుంది?" అని భ్రమపడే విధంగా వారిని నెట్టింది. ఆదివాసీ మహిళను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడం దానికదే గొప్ప విషయంగా వారు నొక్కి చెబుతున్నారు. వివిధ సమూహాల ఆకాంక్షలకు స్పందిస్తున్న వారుగా బిజెపిని, మోడీని వారు కీర్తిస్తున్నారు. ఆదివాసీ సమూహాలను రాజకీయంగా, సాంస్కృతికంగా కలుపుకునే బిజెపి నిలకడైన ప్రయత్నాలుగా ఈ చర్యను వారు కొనియాడుతున్నారు. సాధారణ ఎన్నికలలో ఆదివాసుల, మహిళల ఓట్లను దండుకునేందుకు బిజెపి పన్నిన మాయోపాయంగా దీనిని అర్థం చేసుకోవటానికి వారు నిరాకరిస్తున్నారు.

ఒకవైపున ముస్లిములకు వ్యతిరేకంగా హేయమైన హిందూమతతత్వ జాతీయవాద విద్వేష విధానాలకు అనుగుణంగా ప్రజల అభిప్రాయాన్ని మలచటం ద్వారా, యావత్ ముస్లిమ్ ప్రజానీకపు జీవితాలను కల్పిత సాకుతోనో, ఏదో

కారణంతోనో భూస్థాపితం చేయజూస్తూనే, దేశ సర్వోన్నత కార్యాలయ అధినేత అభ్యర్థిగా ఆదివాసీ మహిళను ఎంపిక చేయటమనే సులువైన యుక్తితో, మేధావులుగా పిలవబడే వారి మద్దతును బిజెపి తనకనుకూలంగా సమీకరించటంలో విజయం సాధించింది. తమ అభ్యర్థి ఎంపికకు అవసరమైన సానుకూల వాతావరణాన్ని కల్పించుకోగలిగింది.

రాష్ట్రపతి, రాజ్యాంగం ద్వారా తనకు సంక్రమించిన పరిపాలనాధికారాలను వినియోగించగలిగిన దేశ అత్యున్నత అధికారానికి సంకేతంగా మిగిలి వున్నాడు. గత 75 సం॥లుగా మనదేశ ప్రజల అనుభవంలో "రాజ్యాంగాన్ని చట్టాలను కాపాడి, పరిరక్షించి, భారత ప్రజల సంక్షేమానికి, సేవకు అంకిత మవుతామ"ని ఎన్నికైన రాష్ట్రపతులు ప్రమాణం చేస్తూనే వస్తున్నారు. అయితే అధికారంలోనున్న ప్రభుత్వాలు ప్రజల హక్కులను బలప్రయోగంతో, క్రూరంగా దురాక్రమిస్తూ, అణచివేస్తూన్న ఒక్క సందర్భంలో కూడా ప్రజలను, వారి హక్కులను పరిరక్షించటానికి రాష్ట్రపతి నిలిచిన దాఖలాలు లేవు. వారి వ్యక్తిగత, స్వీయ విజయాలు కానీ, వారి పేరు ప్రఖ్యాతులు గానీ, లేదా వారి మత, లింగపరమైన అస్తిత్వాలు గానీ, అధికారంలో వున్న ప్రభుత్వాల బాధితులైన ప్రజల సంక్షేమాన్ని పరిరక్షించేందుకు తోడ్పడలేదు.

వాస్తవ రాజకీయాధికారాన్ని కలిగి, నెరిపే ప్రధానమంత్రుల పనుపున మౌన ప్రేక్షకులుగా మాత్రమే వారు వ్యవహరిస్తున్నారు. ఆయా ప్రభుత్వాలు అధికారంలోనున్న కాలంలో నిర్దాక్షిణ్యంగా అమలుచేసిన ప్రజావ్యతిరేక చట్టాలకు, విధానాలకు ఆమోదం తెలుపుతూ వారు రబ్బరు స్టాంపుగా వ్యవహరిస్తున్నారనే నానుడితో కొనసాగుతున్నారు.

అందుకే, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా), టాడా, పోటా వంటి క్రూరమైన చట్టాలను రూపొందించి, వాటిని అమలుచేసి ఆంతరంగిక అత్యయిక పరిస్థితిని విధించటానికి; ఆదివాసీ ప్రాంతాలైన ఈశాన్య రాష్ట్రాలలో, కాశ్మీర్‌లో 'సైనికాధికారుల ప్రత్యేకాధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పిఏ) విధించి పాలన సాగించటానికి; భోపాల్‌లో మున్నెన్నటికంటే ఘోరమైన పారిశ్రామిక ప్రమాదాన్ని సృష్టించిన యూనియన్ కార్బైడ్ ఆఫ్ ఇండియాను సంరక్షిస్తూ, బాధితులకు న్యాయాన్ని నిరాకరిస్తూండటానికి; చట్టభీతి లేకుండా బాబరీ మసీదును నేలమట్టం చేయటానికి; దళితులపై, మహిళలపై, ఆదివాసులపై, మత మైనారిటీలపై, సామాజికంగా బలహీనులపై అత్యాచారాలు చేయడానికి; సాధ్వి ప్రజ్ఞాఠాకూర్ కేసులో లాగా మాలెగావ్ ప్రేలుళ్ళలో నిందితులైన కాషాయ టెర్రరిస్టులను బెయిల్‌పై విడుదల చేసి పార్లమెంటు సభ్యులుగా వారిని ముందుకు తేవడానికి; కార్మికుల చట్టపరమైన హక్కులన్నింటినీ నిరాకరించే విధంగా కార్మిక చట్టాలన్నింటినీ నిరుపయోగమైన కోడ్‌లుగా రూపొందించడానికి; భారీ ఆనకట్టల నిర్మాణం పేరుతో, గనుల తవ్వకం పేరుతో నిర్వాసిత సమూహాలకు సరైన పునరావాసం కల్పించకుండానే ఆదివాసులను పెద్దసంఖ్యలో వారి ఆవాసాల నుండి విస్థాపనకు గురిచేయడానికీ - ప్రభుత్వాధికారం లోనున్న పాలకులకు సాధ్యమౌతోంది.

పైన పేర్కొన్న ఈ అన్ని సందర్భాలలోనూ దళిత, ముస్లిమ్, మహిళ మొదలుగా గల వివిధ అస్తిత్వాలకు చెందిన రాష్ట్రపతులంతా, ప్రభుత్వాధికారంలోనున్న పాలకవర్గాల, పాలకుల ప్రయోజనాలకు దాసోహమై, వారికి సేవచేస్తూ మౌన ప్రేక్షకులుగా మిగిలిపోయారు మినహా, మనదేశ ప్రజల సంక్షేమానికనుగుణంగా నడుచుకోవటానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు.

మరోసారి రాష్ట్రపతి ఎన్నిక జరుగుతున్న ప్రస్తుత కాలంలో కూడా, ప్రజల సంక్షేమానికి చెందిన ప్రాథమిక హక్కులు, మౌలిక సూత్రాల ప్రయోజనాల దిశగా పరిస్థితులేమీ మెరుగవ్వలేదు; మారలేదు.

జాతీయ గనుల అభివృద్ధి కార్పొరేషన్లను దళారులుగా చేసి, వాని ద్వారా భారీ ఆనకట్టలు లేదా గనుల తవ్వకం పేరుతో ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్, ఒరిస్సా రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో ఆదివాసీ సమూహాలను వారి సహజ ఆవాసాల నుండి విస్థాపనకు గురిచేస్తుంటే, కాబోయే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏనాడూ దీనికి విరుద్ధంగా నిరసన తెలిపినట్లు కానీ వ్యతిరేకించినట్లు గానీ మనం చూడలేదు.

విస్థాపనకు గురైన బాధితులకు తగిన పునరావాసం కల్పించాలనీ, విస్థాపనకు గురైన ఆదివాసీ సమూహాలకు గౌరవ ప్రదమైన జీవనాధారం కల్పించాలని ఒక ఆదివాసీ మహిళగా ఆమె ఏనాడూ డిమాండ్ చేసినట్లుగా మనం చూడలేదు. అలాగే, ఆమె ఈశాన్య ప్రాంత ఆదివాసీ రాష్ట్రాలలో సైనికులు సాగించే అత్యాచారాలకు వ్యతిరేకంగా కానీ, ప్రత్యేక సైనికాధికారాల చట్టాన్ని రద్దుచేయాలని కానీ ఏనాడూ డిమాండ్ చేయటాన్ని మనం చూడలేదు. ఒక ఆదివాసీ మహిళగా ఆమె సుగుణాలు, వ్యక్తిగత విజయాలు ఏమైనప్పటికీ, ఆ నైపుణ్యాలు, శక్తి సామర్థ్యాలన్నీ ప్రభుత్వాధికారంలోనున్న దోపిడీ పాలకవర్గాల, ప్రత్యేకించి నిరంకుశ బిజెపి, దాని పాలకుల ప్రజావ్యతిరేక దోపిడీ ప్రయోజనాలకు సేవచేయటం, వాటిని కాపాడటం, వాటిని ముందుకు తీసుకెళ్ళటానికే ఉపయోగించింది.

సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం విస్తృతంగా ప్రచారంలో చూపుతున్న విధంగా చీపురుతో ఆమె ఒక దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసిందనటంలో సందేహం లేదు. దీనితోనే ఆమె శ్రమను గౌరవిస్తుందని, ఆమె సాదా జీవనాన్ని గడుపుతుందని అర్థం చేసుకోవల్సిన అవసరంలేదు. దానికి భిన్నంగా, ఒక దేవాలయ ఆవరణను శుభ్రం చేయటం ద్వారా హిందూ మతతత్వ సిద్ధాంత శక్తులకు, శ్రేణులకు,

నమ్మకస్తురాలినని తనకుతాను రుజువుపరచుకుందని అర్థం చేసుకోవాలి.

ఆమె వర్గ స్వభావాన్ని పరిగణలోకి తీసుకోకుండా, ఆదివాసీ మహిళను భారత రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించటాన్నే ఒక ప్రగతిశీల పరివర్తనగా, ఆదివాసుల సాధికారతకు ప్రతీకగా ఉద్భోధించటం, స్వయం కల్పిత భ్రమ లేదా ఆత్మవంచన మినహా వేరుకాదు.

భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన మొదటిరోజు నుండే, రైసినా హిల్స్‌లోని రాష్ట్రపతి కార్యాలయం మరియు మహాసౌధము యొక్క అవసరమేమిటనే ముఖ్యమైన ప్రశ్న తలెత్తింది. సామ్రాజ్య వాదుల కనుసన్నలలో నడిచే, కేంద్ర ప్రభుత్వాధికారం నెరిపే ప్రధానమంత్రి అనే మావటివాని అదుపాజ్ఞలలో, ఆదేశాలతో నడుచుకునే ఐరావతం మినహా రాష్ట్రపతి పీఠం వేరుకాదు.

కనుక, రాష్ట్రపతి పీఠంపై ఎవరు కూర్చుంటారనేదానికి భారత ప్రజల జీవితాలలో ప్రాధాన్యతే లేదు. ఆమె లేక అతను ఒక ప్రఖ్యాత శాస్త్రవేత్త కావచ్చు, లేదా ఏదో ఒక పెద్ద వ్యాపారవేత్త అయిన ఓ రాజకీయ నాయకుడు కావచ్చు. లేదా కార్మిక సంఘ నాయకుడు కావచ్చు, లేదా మత మైనారిటీ, దళిత, సమూహాలకు చెందినవారు కావచ్చు లేదా వైశ్య లేక ఆదివాసీ నేపథ్యమున్న మహిళ కావచ్చు - ఇవేవీ భారత ప్రజల జీవితాలకు సంబంధించిన విషయాలే కాదు.

కనుక, రాష్ట్రపతి ఎన్నికపై పాలకవర్గ ప్రచారానికి ఎవరూ లోనుకావద్దు. అంతేగాక, సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రయోజనాలకు సేవచేసే ప్రస్తుత పాలక కూటమిని కూలదోయటానికి మనకు మనం నిర్మాణ యుతం గావటానికి మన ప్రయత్నాలన్నింటితో శ్రమించాలి. మత, కుల, తెగ, భాషా అంశాలపై ప్రజలను విడదీసే కుట్రలకు వ్యతిరేకంగా పోరాడుదాం.

*****